క్లుప్తంగా

పోలీసులకు ఉచిత కంటి వైద్యపరీక్షలు

ఇల్లెందు: ఇల్లెందు సబ్ డివిజన్ పోలీసులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం ఐతా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఎస్పీ చంద్రభాను ఈ పరీక్ష కేంద్రాన్ని ప్రారంభించారు. మాక్స్ విజన్, డాక్టర్ శరత్, నరేందర్‌ల ఆధ్వర్యంలో 80 మంది పోలీసులకు కంటి పరీక్షలు చేశారు.

వంట గ్యాస్ ధర తగ్గించాలి

ఇల్లెందు: కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధరలు పెంచటం తగదని, పెంచిన ధరలు వెంటనే తగ్గించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కె.సారయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఇల్లెందులో సీపీఐ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి పాత బస్టాండ్ సెంటర్‌లో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. డి.శంకర్, బంధం నాగయ్య, ఉడుత ఐలయ్య, బాస శ్రీనివాసరావు, కుమ్మరి రవీందర్, బి.సత్యనారాయణ, సుశీల, స్వరూప పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీరు సరఫరా చేయండి..

ఇల్లెందురూరల్: ఒడ్డుగూడెం గ్రామపంచాయతీ నెహ్రూనగర్‌లో మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతీ ఇంటికి తాగునీటిని సరఫరా చేయాలని కాంగ్రెస్ మండల శాఖ ఉపాధ్యక్షుడు వల్లాల రాజయ్య విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన గ్రామంలో మాట్లాడుతూ... గ్రామంలో కొంత ప్రాంతానికి మాత్రమే భగీరథ నీటి సరఫరా జరుగుతోందని, ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని గ్రామం అంతటికీ తాగునీరు అందించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

పాల్వంచరూరల్: పట్టణ, మండల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఎన్పీడీసీఎల్ రూరల్ ఏఈ రవీందర్, పట్టణ ఏఈ ప్రతాప్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి 11 వరకు కాంట్రాక్టర్స్ కాలనీ, ఇందిరానగర్ కాలనీ, జయమ్మకాలనీ, సీతానగర్‌కాలనీ, బీసీఎంరోడ్డు, మార్కెట్ ఏరియా, వేంకటేశ్వర హిల్స్ కాలనీలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. అదేవిధంగా యానంబైల్ 33 కేవీ ఫీడర్ లైన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు కిన్నెరసాని, కోడిపుంజులవాగు, పునుకుల, సత్యనారాయణపురం, రెడ్డిగూడెం, ఉలవనూరు గ్రామల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాగునీటి సరఫరా...

ఇల్లెందు: దుమ్ముగూడెం మిషన్ భగీరథ మోటార్లకు మరమ్మతులు చేస్తున్నందున శనివారం తాగునీటి సరఫరా ఉండదని కమిషనర్ శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతరాయాన్ని గమనించి పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రభుత్వంపై పోరాడాలి

పాల్వంచ: దేశ వ్యాప్తంగా రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న పాలకులపై పోరాటాలకు సిద్ధం కావాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్యాల విశ్వనాథం పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో రైతు సంఘం (ఏఐకేఎస్) 88వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. వైఎస్ గిరి, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు సంక్షేమ పథకాలు

జూలూరుపాడు: అర్హులైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్ తెలిపారు. శుక్రవారం జూలూరుపాడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాజీవ్ యువ వికాసం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం జరగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను విస్తృత ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు.

గడువు పొడిగించాలి

జూలూరుపాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి గడువు పొడిగించాలని ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి ఎస్కే చాంద్‌పాషా కోరారు. శుక్రవారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ.. ప్రభుత్వ సెలవులు, నెట్ సెంటర్లకు ఆన్‌లైన్ చేసుకోవడానికి వెళ్తే సాంకేతిక లోపాల కారణంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నట్లు చెప్పారు.

న్యాయం చేయండి..

సింగరేణి(కొత్తగూడెం): చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్.కిరణ్‌రాజ్‌కుమార్‌ను సమాచార హక్కు సాధన స్రవంతి సంస్థ జిల్లా అధ్యక్షుడు బండా శ్రీధర్‌రెడ్డి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వినతిపత్రం అందజేసి మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టాన్ని సింగరేణిలో అమలు చేసి దరఖాస్తుదారుడికి పూర్తిస్థాయిలో సమాచారం ఇవ్వాలని కోరారు. అదేవిధంగా మెడికల్ బోర్డ్‌లో అవకతవకలు లేకుండా అర్హులైన కార్మికులందరికీ న్యాయం చేయాలని పేర్కొన్నారు.

వసతుల కల్పన ఎండమావి..

- ఉపాధి పని ప్రదేశాల్లో సౌకర్యాలు కరువు
- ఏడు వారాలుగా అందని వేతనం
- రోజువారీ ఖర్చులకు అవస్థ పడుతున్న కూలీలు

చుంచుపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తున్న కూలీలకు కనీస సౌకర్యాలు కరవయ్యాయి. నిబంధనల ప్రకారం కల్పించాల్సిన వసతులను అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికే ఎండల తీవ్రత పెరగడంతో కూలీలు ఇబ్బంది పడుతున్నారు. గతంలో వీరికి పని ప్రదేశంలో నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేసేవారు. తాగునీటితో పాటు మజ్జిగ, మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం అవేవీ లేవు. కొన్ని గ్రామాల్లో మాత్రమే టెంట్లు వేస్తుండగా మిగతా చోట్ల చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. కనీస వసతులతో పాటు అటు కూలీలకు చేసిన పనులకు సకాలంలో వేతనాలు అందక అవస్థలు పడాల్సి వస్తోంది. గడిచిన ఏడు వారాలుగా ఉపాధి కూలీలకు వేతనాలు అందటం లేదు. గ్రామాల్లో ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య రోజూరోజుకూ పెరుగుతోంది. కొలతల ప్రకారం పనులు చేయకపోతే కూలీ గిట్టుబాటు కాదని ఎండలో పనులు చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

ఎనిమిదేళ్లుగా అందని పరికరాలు...

కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలో పాల్వంచ, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్ నాలుగు గ్రామీణ మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలోని 105 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులు ప్రతీ


చుంచుపల్లిలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

నియోజకవర్గంలో గ్రామీణ మండలాలు	4
మొత్తం గ్రామ పంచాయతీలు	105
యాక్టివ్ కూలీల సంఖ్య	35,459
ప్రస్తుతం హాజరయ్యే కూలీలు	7,267

వేసవిలో జోరుగా జరుగుతాయి. 2017 వరకు పని ప్రదేశంలో తాగు నీరు, కూలీలకు నీడ కోసం టెంట్లు, ప్రాథమిక చికిత్స కోసం మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లతో పాటు పరికరాలను అందజేసేవారు. ఉపాధి కూలీలకు దాదాపు ఎనిమిదేళ్లుగా తాగునీరు, పార, గడ్డ పార, తట్టలు తదితర సామగ్రి అందడం లేదు. వేసవిలో మట్టిని తవ్వడం కష్టం కనుక వేతనదారులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం గతంలో తాగునీటికి రూ.5, గడ్డ పారకు రూ.10, తట్టకి రూ.13 చెల్లించేది. వేసవి సీజన్‌లో 70 శాతం పనులు చేస్తే మిగిలిన 30 శాతం వేసవి భత్యం కింద కలిపి మొతం 100 శాతం కూలీలకు చెల్లించేవారు. మూడేళ్లుగా ఉపాధి వేసవి భత్యాన్ని రద్దు చేశారు. మరోవైపు ఉపాధి హామీ పథకంలో రోజంతా కష్టపడి పనిచేస్తున్నా కూలి గిట్టుబాటు కావడం లేదని పలువురు కూలీలు వాపోతున్నారు. రోజుకు గరిష్ఠంగా రూ.307 వరకు సొమ్ము అందాల్సి ఉండగా, రూ.200కు మించి రావడంలేదని వాపోతున్నారు. ఏడాదికి కనీసం 200 పనిదినాలను కల్పించి, రోజువారీ ఇచ్చే కూలిసొమ్మును సైతం అధికంగా చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పని ప్రదేశంలో కనీస వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. కనీసం తాము చేసిన పనికి సకాలంలో బిల్లులు రావడం లేదని కూలీలు వాపోతున్నారు.

వసతులు కల్పించాలి...



ఎండలు తీవ్రత దృష్ట్యా పని ప్రదేశాల్లో తాగునీరు, టెంట్, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలి. కూలీలకు క్రమం తప్పకుండా వారం రోజుల కోసారి డబ్బులు చెల్లించాలి. ఉపాధి హామీ పథకంలో ప్రతీ ఏడాది ఎండాకాలం కరువు భత్యాన్ని అందించేవారు. మూడేళ్లుగా ఇవ్వటం లేదు. అవి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– ఇనుముల మంగయ్య, ఉపాధి కూలీ

ఉపాధి పనులే ఆధారం...



ప్రతీ వేసవిలో ఈ ఉపాధి హామీ పనులే మాకు ఆసరా. వేసవి సీజన్‌లో మాకు చేతినిండా పని దొరుకుతుంది. మా కుంటుంబం మొత్తం ఈ పనులపైనే ఆధారపడతాం. ప్రస్తుతం ఎండలు ముదురుతున్నందున తాగేందుకు నీళ్ల ఇంటి నుంచే సీసాల్లో తీసుకెళ్తున్నాం. ఎండ తీవ్రత పెరగక ముందే ఇంటికొస్తాం.

– సీహెచ్.చంటి, ఉపాధి కూలీ

సౌకర్యాల కల్పనకు చర్యలు...



వేసవి నేపథ్యంలో ఉపాధి హామీ పని ప్రదేశాల్లో కూలీలకు కనీస వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. అన్ని గ్రామాల పరిధిలో కూలీలకు టెంట్లు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని ఏపీఓలకు సూచిస్తున్నాం. గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్య పెరిగేలా మరింత శ్రద్ధ తీసుకుంటున్నాం.

– ఎస్.రవి, అదనపు డీఆర్‌డీఓ

చెత్త సేకరణలో కొత్త పద్ధతి

ఇల్లెందు: నిన్నటి వరకు తడి, పొడి చెత్తకు రెండు వేర్వేరు బుట్టలు ఉండేవి, వాటిలో తడి చెత్త ఒక బుట్టలో పొడి చెత్త మరో బుట్టలో వేసి మున్సిపల్ వాహనానికి అందజేసేవారు. ఇక మీదట అలా కాకుండా నేటి నుంచి ఇల్లెందు మున్సిపాలిటీ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తాజాగా ఇంటింటికీ మున్సిపాలిటీ ద్వారా ఒక జూట్ బ్యాగ్ అందజేస్తున్నారు. ఇందులో పొడి చెత్త మాత్రమే వేసి బుధ, శనివారాల్లో మాత్రమే చెత్తబండికి అందజేయాలి. ఇక తడి చెత్తను మాత్రం ప్రతీరోజు ఇంటి ముందుకు వచ్చే చెత్త వాహనానికి ఇవ్వాలి. ఇప్పటి వరకు తడి, పొడి చెత్త కలిపి అందజేయడం వల్ల తీసుకెళ్లిన తరువాత వర్కర్లు తడి, పొడి చెత్తను వేరు చేసేందుకు ఇబ్బంది పడుతున్నారు. దీనికి చెక్ పెట్టేందుకు ఈ నూతన పద్ధతిని అమలు చేస్తున్నారు. ఈ ప్రక్రియను ప్రస్తుతం ఇందిరానగర్, కాకతీయనగర్‌లో అమలు చేసి ఆ తర్వాత అన్ని ప్రాంతాలకు విస్తరించబోతున్నారు.


అవగాహన కల్పిస్తున్న కమిషనర్ శ్రీకాంత్

శుక్రవారం ఇందిరానగర్‌లో ఇంటింటి సంచులు పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ ప్రారంభించారు. అనంతరం అక్కడి ఆర్పీలకు ఆ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని అందరూ పాటించి మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ అంకుషావలీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లాలియా, జవాన్లు, ఆర్పీలు, టీఎంసీ, సీఓలు పాల్గొన్నారు.

యూనిఫామ్ సిద్ధంగా ఉండాలి


ఇల్లెందురూరల్: క్లాత్ అందజేస్తున్న ధన్‌సింగ్

ఇల్లెందురూరల్: వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే విద్యార్థుల యూనిఫామ్ కుట్టడం పూర్తి చేయాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. కుట్టడం కోసం ఎంపిక చేసిన పొదుపు సంఘాల మహిళలకు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. బాలికలు.. 1వ తరగతి నుంచి 3వ తరగతి వరకు బాడీ ఫ్రాక్ విత్ షర్ట్, 4, 5వ తరగతుల వారికి షర్ట్, స్కర్ట్, 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు పంజాబీ డ్రెస్, వైట్ కోట్, బాలురు.. 1వ తరగతి నుంచి ఏడో తరగతి వరకు షర్ట్, నిక్కర్లు, ప్యాంట్, 8వ తరగతి నుంచి 12వ తరగతి వరకు షర్ట్, ప్యాంట్ కుట్టాల్సి ఉంటుందని వివరించారు. దీనికోసం అవసరమైన సామగ్రిని నిర్దేశిత ప్రాంతాలలో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. మే 25వ తేదీ నాటికి కుట్టడం పూర్తి చేయాలని సూచించారు. మండలంలోని 84 పాఠశాల్లో 1,325 బాలురు, 1,286 బాలికల క్లాత్‌ను మహిళా టైలర్లకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెర్ప్ ఏపీఎం దుర్గారావు, వివిధ పాఠశాలల హెచ్ఎంలె, సెర్ప్ సిబ్బంది పాల్గొన్నారు.

టేకులపల్లి: జూన్ 1 పాఠశాలలు ప్రారంభానికి ముందే విద్యార్థులకు యూనిఫామ్ అందజేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని టేకులపల్లి మండల విద్యాశాఖ అధికారి అజ్మీర జగన్ నాయక్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం టేకులపల్లి ఎంఈఓ కార్యాలయం వద్ద యూనిఫామ్ క్లాత్‌లను మండలంలోని 93 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జూన్ 1లోపు యూనిఫామ్ కుట్టి విద్యార్థులకు అందజేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం జోగ రవి, హెచ్ఎం వెంకయ్య పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: స్కూల్స్ తెరిచే లోగా విద్యార్థులకు యూనిఫామ్ కుట్టి అందజేయాలని మండల విద్యాశాఖాధికారి శ్రీరామ్మూర్తి, ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి సూచించారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు మొదటి విడత యూనిఫామ్ క్లాత్‌ను సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ టైలర్లకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎంఐఎస్ శ్రావణి, సీసీఓ రాజశేఖర్, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లోనే తల్లీబిడ్డలకు పోషకాహారం

కొత్తగూడెంఅర్బన్: పోషకాలు ఉన్న ఆహారం తీసుకుంటేనే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా సంక్షేమ అధికారిని స్వర్ణలత లెనీనా అన్నారు. శుక్రవారం లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులు, గర్భిణులకు అవగాహన కల్పించారు. పోషకాహార లోపం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి చెప్పారు. పిల్లల బరువులు, ఎత్తులు చూసుకోవాలన్నారు. తల్లి ఆరోగ్యంగా ఉంటేనే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సఅడీపీఓ లక్ష్మీప్రసన్న, సూపర్‌వైజర్ రమాదేవి పాల్గొన్నారు.

టేకులపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లీబిడ్డలు, గర్భిణులకు అందించే పోషకాహారం ద్వారా ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు సీడీపీఓ కేఎం తార అన్నారు. ఈ మేరకు ఈ నెల 8 నుంచి 22 వరకు పోషణ పక్షం వేడుకల్లో భాగంగా శుక్రవారం టేకులపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ అనురాధ ఆధ్వర్యంలో బేతంపూడి జీపీ స్టేజీతండా, సులానగర్ సెక్టార్ సూపర్‌వైజర్


టేకులపల్లి: బేతంపూడిస్టేజీ అంగన్‌వాడీలో అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీఓ తార

బి.నిర్మల ఆధ్వర్యంలో పెగళ్లపాడు పంచాయతీ పడమటిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. ఆమె పాల్గొని మాట్లాడుతూ.. తల్లులకు 1000 రోజులు గురించి వివరించారు. చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. చిరుధాన్యాలు, ఇతర తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న పిండి వంటలను ప్రదర్శించారు.

సంతాప సభను జయప్రదం చేయండి..

సింగరేణి(కొత్తగూడెం): సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర సభ్యులు ముక్తార్ పాషా సంతాప సభ ఈనెల 15న బయ్యారంలో జరగనుందని, జయప్రదం చేయాలని పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం కొత్తగూడెం ఇఫ్టూ కార్యాలయంలో సంతాపసభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌని మాట్లాడుతూ... ముక్తార్ పాషా చదువుకునే రోజుల్లోనే బడుగు బలహీన వర్గాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం పార్టీ నాయకుడిగా కేంద్ర కమిటీ స్థాయి వరకు ఎదిగాడన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పీడీఎస్‌యూ విద్యార్థి సంఘంలో చేరి అదే క్రమంలో పేద ప్రజల సమస్యల కోసం అనేక పోరాటాలు సాగించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.సంజీవ్, సురేష్, నరసింహా, కృష్ణ, సంధ్య, నాగమణి, కరుణ, రాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం

పాల్వంచరూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సన్న బియ్యం పథకం పేదలపాలిట వరమని మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. జగన్నాథపురంలో శుక్రవారం ఆయన సన్న బియ్యం లబ్ధిదారుని ఇంట్లో సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టీఏ సభ్యులు బాదర్ల జ్యోషి, నాయకులు గంధం నర్సింహారావు, కె.వెంకన్న, వెంకటేశ్వర్లు, బి.అనిత, బాలాజీ, బ్రహ్మాచారి, కామాచారి, బండి ఉదయ్, పాషా, కవిత, సరోజన, రాములమ్మ, జలందర్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సంగం ఎస్సీకాలనీలో దాసు ఇంట్లో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కోనేరు సత్యనారాయణ(చిన్ని) సన్న బియ్యంతో వండిన భోజనం చేశారు. మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. ధర్మపురి ప్రసాద్, షేక్ బడే, మునుగంటి వెంకటరమణ, ధనుగూరి వెంకన్న, వెంకట్రావ్, రమేష్, రత్నం, రావి రాంబాబు, హరిహరన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


సంగంలో భోజనం చేస్తున్న కోనేరు చిన్ని

25 నుంచి ఎస్‌ఎఫ్ఐ మహాసభలు


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

టేకులపల్లి: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర 5వ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి బయ్య అభిమన్యు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం టేకులపల్లిలో విద్యార్థులతో కలిసి వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. మాట్లాడుతూ... ఎస్ఎఫ్ఐ రాష్ట్ర 5వ మహాసభలు ఉద్యమాల గడ్డ అయిన ఖమ్మంలో ఈనెల 25, 26, 27 తేదీలలో జరుగుతాయని చెప్పారు. సంఘం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు విద్యార్థుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, సంక్షేమ వసతి గృహాలలో చదువుకునే విద్యార్థులను నాణ్యమైన భోజనం అందించాలని, కళాశాలలో, యూనివర్సిటీలలో చదువుకునే విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫెలోషిప్ల సాధనే లక్ష్యంగా పోరాడుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలను తిప్పికొడుతోందన్నారు. విద్యా హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలుచేయకుండా ఈ పాలక వర్గాలు తుంగలో తొక్కుతున్నాయని ఆరోపించారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు ఇష్టానుసారంగా అనుమతులు ఇస్తూ ప్రభుత్వ విద్యకు తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలకు విద్యార్థులు, మేధావులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహేందర్, సుధీర్, ప్రశాంత్, నవీన్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు ఉన్నత స్థాయికి ఎదగాలి


విద్యార్థినులతో అధ్యాపకులు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్ పద్మ

పాల్వంచరూరల్: విద్యార్థినులు సమయాన్ని వృథా చేయకుండా భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.పద్మ అన్నారు. సాంఘిక సంక్షేమ గురుకులు మహిళ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఘనంగా కాలేజీ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు.

ఈ సందర్భంగా విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. వైస్ ప్రిన్సిపాల్ జ్వలిత, అధ్యాపకులు, విద్యార్థినులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహాత్మా జ్యోతిబాపూలే జయంతి వేడుకలు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పట్టణంలో శుక్రవారం పలుచోట్ల మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ ఆధ్వర్యంలో జిల్లా కోర్టులోని లైబ్రరీ హాల్‌లో జరిగిన వేడుకల్లో బార్ ఉపాధ్యక్షుడు జె.గోపికృష్ణ, బాగం మాధవరావు, కాసాని రమేష్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. పాత కొత్తగూడెం ఇందిరమ్మ కాలనీలో జరిగిన పూలే జయంతి వేడుకలో ముఖ్యఅతిథులుగా వన్‌టౌన్, త్రీటౌన్ సీఐలు ఎం,కరుణాకర్, శివప్రసాద్ హాజరయ్యారు. బండిపల్లి కిరణ్, మంద సాంబయ్య, ఇల్లందుల ప్రవీణ్ పాల్గొన్నారు.

కొత్తగూడెంఅర్బన్: అణగారిన వర్గాలకు అక్షరజ్యోతిగా మహనీయుడు మహాత్మా జ్యోతిరావుపూలే నిలిచారని జై భీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యర్రా కామేష్ అన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయం వద్ద పూలే 198వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడారు. గంధం మల్లికార్జునరావు, మాలోత్ వీరు నాయక్, వంగా రవిశంకర్, అల్లకొండ శరత్ పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో జరిగిన మహాత్మాజ్యోతిరావు పూలే జయంతి వేడుకకు ముఖ్యఅతిథిగా సింగరేణి డైరెక్టర్(పా) అండ్ పీపీ కే.వెంకటేశ్వరావు, విశిష్ట అతిథిగా డైరెక్టర్ ఈ అండ్ ఎం సత్యనారాయణరావు హాజరు కాగా జీఎం పర్సనల్ కవితానాయుడు, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కే.రాజ్‌కుమార్, ఐఎన్‌టీయూసీ నాయకులు త్యాగరాజన్, జీఎంలు, ఉద్యోగులు పాల్గొన్నారు.


కొత్తగూడెంటౌన్: జిల్లా కోర్టులో పూలే జయంతి వేడుకల్లో పాల్గొన్న బార్ అసోసియేషన్ సభ్యులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శుక్రవారం జరిగిన జ్యోతీరావు పూలే జయంతి వేడుకలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శారద, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

చుంచుపల్లి: బీజేపీ ఆధ్వర్యంలో కొత్తగూడెం గాంధీ కాలనీలో శుక్రవారం మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా జరుపుకున్నారు. పీఎం విశ్వకర్మ జిల్లా కోఆర్డినేటర్ ఆకుల నాగేశ్వరరావు గౌడ్, జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కొదమసింహం పాండురంగాచార్యులు, టీ.నరేంద్రబాబు, బైరి నిర్మల, రాయుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.


పాల్వంచ: కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన జ్యోతిరావు పూలే జయంతి వేడుకలో నాయకులు రాము నాయక్, విజయ్, భువన సుందర్ రెడ్డి, సత్యం, దేవీలాల్, బీఎస్ చారి తదితరులు పాల్గొన్నారు. కేటీపీఎస్ 5,6 దశల కర్మాగారంలో సీఈ ఎం.ప్రభాకర్‌రావు, ఎస్ఈలు టి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. కేటీపీఎస్ బీసీ అసోసియేషన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో జెన్కో అధ్యక్షుడు కొమరవెల్లి రవీందర్, నాయకులు ఆడెపు రమాకాంత్, హరికృష్ణ, వినోద్ బాబు పాల్గొన్నారు.


జూలూరుపాడు: మండల కేంద్రం జూలూరుపాడులో దళిత, బహుజన, బీసీ నాయకుల ఆధ్వర్యంలో స్థానిక నవోదయ కాంప్లెక్స్ వద్ద మహాత్మా జ్యోతిబా పూలే 199వ జయంతిని నిర్వహించారు. వేల్పుల నరసింహారావు, మాలోత్ మంగీలాల్ నాయక్, దుద్దుకూరి మధుసూధన్‌రావు, లకావత్ లచ్చు నాయక్, ఏదులాపురం గోపాల్‌రావు, ముదిగొండ వెంకటప్పయ్య పాల్గొన్నారు.


ఇల్లెందురూరల్: సామాజిక సమానత్వానికి నిదర్శనం జ్యోతీరావుపూలే అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య అన్నారు. మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. పూలే దంపతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు.

టేకులపల్లి: మహాత్మా జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా శుక్రవారం టేకులపల్లి మండల కేంద్రంలో ఏపీఎంకే ఆధ్వర్యంలో పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏపీఎంకే రాష్ట్ర అధ్యక్షుడు మెంతన ప్రభాకర్, నాయకులు బొమ్మెర రమేష్ బాబు, బొమ్మెర జగన్, రవి, బొమ్మెర సహస్ర, గోశిక సుష్మ, మేకల రజిని పాల్గొన్నారు.

ఇల్లెందు: విద్య ద్వారానే సమాజం మార్పు చెందుతుందని అనేక పోరాటాలు నిర్వహించిన మహాత్మా జ్యోతిరావు పూలే పేదల గుండెల్లో చిరస్మరణీయుడని సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం వి.కృష్ణయ్య అన్నారు. శుక్రవారం సీఈఆర్ క్లబ్‌లో పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బి.నాగేశ్వరరావు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, అధికారులు పాల్గొన్నారు. సీపీఎం కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో నాయకులు నబీ, ఆలేటి కిరణ్, సిరాజ్ అహ్మద్, కృష్ణ, మోహన్‌రావు, సర్వన్‌పాసీ, పద్మ, వజ్జ సురేష్, వీరభద్రం, నాగమణి, వీరయ్య, శ్రీనివాస్, సారయ్య పాల్గొన్నారు.


ఇల్లెందు: నివాళులర్పిస్తున్న సింగరేణి జీఎం కృష్ణయ్య తదితరులు


కొత్తగూడెంఅర్బన్: నినాదాలు చేస్తున్న జై భీమ్‌రావ్ భారత్ పార్టీ నాయకులు


పాల్వంచ: కేటీపీఎస్ బీసీ అసోసియేషన్ హాల్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు